


## చివరికోరిక

2013లో నేను అమెరికా వెళ్ళినప్పుడు ఓ దినపత్రికలో ఓ వార్త చదివాను. హత్యానేరం మీద ఒకతనికి మరణ శిక్ష పడిన కొంతకాలానికి అతను నేరస్థుడు కాడని డి.ఎన్.ఏని బట్టి తెలుసుకున్న పోలీసులు అసలు హంతకుడిని కనుక్కున్నారు. నేను ఇంటర్నెట్‌లో ఈ అంశం మీద సెర్చ్ చేస్తే అలా చాలామంది అమాయకులకి మరణశిక్ష విధించబడిందని డి.ఎన్.ఏని కనుక్కున్న తర్వాత ఈ సంగతి బయటపడిందని చదివాను. అన్ని సంఘటనల్లో నాకు బలమైన నాటకీయత కనిపించింది.




ఆ సమయంలోనే మా అమ్మాయి కావ్య నన్ను బకెట్ లిస్టు అనే హాలీవుడ్ సినిమాకి తీసుకెళ్ళింది. మరణానికిముందు తీరని కోరికలని బకెట్‌లిస్ట్ అంటారు. అందులో కూడా మరణానికి సిద్ధంగా ఉన్న ఓ వ్యక్తికి తీరని కోరికలుంటాయి. ఆ పాయింటూ, ఈ డి.ఎన్.ఏ పాయింటు కలిపి ఈ నవలని అల్లాను. దానికి 'ఆఖరి కోరిక' అనే వర్కింగ్ టైటిల్ పెట్టాను.

ఆ థీమ్ నన్ను వెంటాడటంతో నవలగా రాసాను. 2014 జూన్‌లో ప్రిజమ్ బుక్స్ అనే ఇంగ్లీష్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ హైదరాబాద్ మేనేజర్ శ్రీ బి.రవీంద్రనాథ్ 'కర్మ జన్మ' అనే పుస్తకం కోసం మా ఇంటికి వచ్చారు. దాన్ని ఆయన బంధువులెవరో తెప్పించమని కోరారు.

"మీ ఇంటిముందునుంచి అనేకసార్లు వెళుతూ మల్లాది పేరు చూసాను కానీ మీ దగ్గరకు రావాలని తోచలేదు. ఇప్పటికి కుదిరింది"అని ఆయన చెప్పారు.

మా ముగ్గురు అమ్మాయిలు చదువు, ఉద్యోగాల నిమిత్తం అమెరికా వెళ్ళడంతో మా అయిదు బెడ్ రూమ్‌ల ఇల్లు చాలా పెద్దది అనిపించింది. అదే సమయంలో మా ప్రక్కింటి స్థలంలో అపార్టుమెంట్లు కట్టటంతో ఓ ఫ్లాట్‌ని మేము తీసుకుని అందులోకి షిఫ్ట్ అయ్యాము. ఆ సంగతి రవీంద్రగారికి చెప్పాము.

ఇద్దరమూ పబ్లిషర్స్ అవడంతో మేము ప్రచురణలోని సాధకబాధకాలు మాట్లాడుకునేటప్పుడు ఓ నవల ప్రచురణకి సిద్ధంగా ఉందని చెప్పాను.

కొద్దిరోజుల తరువాత ఆయన మళ్ళీ వచ్చి చెప్పారు.

"మా ప్రిజమ్ బుక్స్ మా టర్నోవర్‌లోని 2.5 పర్సెంట్ తెలుగు ప్రచురణలకి మళ్ళించాలని నిర్ణయించింది. మీ గురించి బుక్ సెల్లర్స్‌లో ఎంక్వైరీ చేశాను. మీకు పబ్లికేషన్స్ ఉందని తెలుసు. అయినా మీకు అభ్యంతరం లేకపోతే మీ నవలని ప్రిజమ్ బుక్స్‌కి ఇవ్వగలరా?"

మేమిద్దరం ఒక అంగీకారానికి వచ్చాం.

"మా ఆఫీస్ హిమాయత్ నగర్‌లో ఉంది. మేం షిఫ్ట్ అవ్వాలనుకున్నాం. మీ యిల్లు ఎవ్వరికీ అద్దెకి ఇవ్వకపోతే ఓసారి చూపిస్తారా?" అడిగారు.

ఆరోజూ మర్నాడు ఆఫీసు సిబ్బందితో మరో రోజు బంధుమిత్రులతో అనుకుంటా రెండు మూడుసార్లు వచ్చి చివరికి తీసుకోడానికి నిర్ణయించారు. ఆ తరువాత 'ఆఖరి కోరిక' అనే టైటిల్‌ని 'చివరికోరిక'గా మార్చి ప్రిజమ్ బుక్స్ వాళ్ళకి ఇచ్చాను.

సూక్ష్మంగా కథ మరణానికి సిద్ధంగా వున్న ఇండస్ట్రిలిస్ట్ భగవంతం తనతో శత్రుత్వం ఉన్న అందరితోను దాన్ని తొలిగించుకుని అజాత శత్రువుగా వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంటాడు. అతనికి తెలిసినవారందరితో దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా అది సాధ్యమైంది. కానీ గుర్తు తెలియని ఓ వ్యక్తి తాలుకు సంఘటన గుర్తొస్తుంది. భగవంతం తన యవ్వనంలో అనుకోకుండా తాగివున్న ఓ రౌడీని ఆత్మరక్షణకి చంపేసాడు. మరణానికి సిద్ధంగా ఉన్నప్పుడు మనసు కొంత స్వచ్ఛమవటం సహజం. తను చంపిన ఆ వ్యక్తి కుటుంబం తరువాత ఏమయిందో అతనొక్కడే వారికి ఆధారమేమో అన్న మీమాంస అతన్ని తొలుస్తుంది. దాంతో వారెక్కడున్నారో కనిపెట్టమని సేనాపతి అనే డిటెక్టివ్‌ని నియమిస్తాడు. మనుషుల్ని వెతకడంలో దిట్టయిన పోలీసాఫీసర్ అతను. గతంలో భగవంతానికి సేనాపతి అనేక సహాయాలు చెయ్యడంతో అతని సమర్ధత భగవంతానికి తెలుసు. సేనాపతి ఆ వ్యక్తి గురించి అన్వేషిస్తుండగా భగవంతం ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తోంది. చివరికి సేనాపతి ఆ హతుడి కుటుంబ సభ్యులని మరణానికి సిద్ధంగా ఉన్న భగవంతం దగ్గరకి తీసుకొచ్చి హతుడి భార్య చేతే తనుకనుక్కున్న నిజాన్ని చెప్పిస్తాడు. ఆ కొసమెరుపుతో భగవంతం చివరికోరిక తీరి హతుడు కుటుంబానికి కొంత ఆర్ధిక సహాయం చేసి నిశ్చింతగా మరణిస్తాడు.

భగవంతానికి ఉన్న చివరికోరికలు మూడు. నేను చిన్నప్పుడు కనకమేడల రాసిన 'మహామాయ' అనే ఉత్కంఠభరితమైన సీరియల్‌ని చదివాను. దాన్ని మళ్ళీ చదవాలని కోరికతో ఎంత ప్రయత్నించినా అవి లభ్యం కాలేదు. అదే కోరికని భగవంతానికి ఆపాదించి ఆ నవలలని పట్టుకోటానికి నేను చేసిన ప్రయత్నాలని నవలలో భగవంతం ఆఫీస్ మేనేజర్‌తో చేయించాను. ప్రకాశం జిల్లా వేటపాలెం లైబ్రెరీరో పాత నవలలున్నాయని తెలిసి నా ఆప్త మిత్రుడు రచయిత శ్రీ ప్రతాప రవిశంకర్ తను ప్రయత్నిస్తానని చెప్పారు. అక్కడ లేవు. రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో కూడా లేవు. విజయవాడలో రవీస్‌కాల్వ ఒడ్డున పాత పుస్తకాలు అమ్మే షాప్స్ చాలా ఉన్నాయి. అక్కడ కూడా నేను ప్రయత్నించాను. మొత్తం సెట్‌ని అయిదువేల రూపాయలకి కొంటానని కొందరికి నా ఫోన్ నెంబర్ కూడా ఇచ్చాను. కానీ దొరకలేదు.

మద్రాసులో కనకమేడల బంధువర్గాన్ని కూడా వెతికి పట్టుకుని ఆ నవలల కోసం ప్రయత్నించాను. కానీ వారబ్బాయితో సహా ఎవరిదగ్గరా అవి దొరకలేదు. ఇక ఎవరిదగ్గరా దొరకవని నిరాశచెందాను.

ఓ రోజు పద్మజ మహా మాయ నవలలని తీసుకొచ్చి చూపించి 'వీటి కోసమేనా మీరు వెతికేది' అని అడిగింది. 24లో కేవల 19 భాగాలు మాత్రమే దొరికాయి. మా ఇంటిదగ్గర ఉన్న నిత్య సాహిత్యా బుక్ లెండింగ్ లైబ్రెరీకి వెళ్ళినప్పుడు కౌంటర్ మీద అవి కనిపించాయంట. ఇల్లు ఖాళీ చేసి వెళ్ళే ఎవరో వాటిని ఇచ్చారట. వాటన్నిటినీ వెంటనే చదివాను. 'చివరికోరిక' నవల వ్రాసినప్పుడు పుస్తకాల పేర్లు రాయడానికి ఉపయోగించాయి. ఆ పుస్తకం ప్రచురించబడ్డాక చాలామంది పాఠకులు 'మహామాయ' నాదగ్గర వుందనుకుని అది కావాలని నాకు ఫోన్స్ కూడా చేసారు.

ఈ నవల వెలువడిన తరువాత ఖమ్మంకి చెందిన సాహిత్యాభిమాని శ్రీ కమలాకర్ రెడ్డి ఆ పుస్తకాల కోసం ప్రయత్నించి మొత్తానికి 24 భాగాలు సాధించి పిడిఎఫ్ చేసి నాకు పంపారు. ఆయన నడిపే వాట్సాప్ గ్రూప్ 'పుస్తకప్రియుల సంఘం'లో కూడా వీటిని అప్‌లోడ్ చేసారు.

ఇటీవల క్లాసిక్ బుక్స్ అనే ప్రచురణ సంస్థ ఆ నవలని రెండు భాగాలుగా వెలువరించి గొప్ప సేవ చేసారు. కమలాకర్ రెడ్డిగారు పుస్తకాన్ని అందుబాటులోకి తేవడం వలనే ఇది పుస్తకంగా ప్రచురించబడిందని చెప్పాలి.

ఈ నవలలో ఓ పాత్ర జేబుదొంగ. ఇంటర్నెట్‌లో జేబుదొంగల గురించి సెర్చ్ చేసి వాళ్ళ ట్రిక్స్ మొదలైనవి ఆ పాత్ర ద్వారా తెలియజేసాను. జేబుదొంగతనాలకి గురవకుండా వుండేందుకు అవి ఉపయోగపడతాయి.

నేను చదివిన ఓ వ్యాసంలో పుర్రె ఆధారంగా ఆ మనిషి మొహం ఆకృతిని రూపొందించే కళ తెలిసిన ఓ ఫోరెన్సిక్ నిపుణుడి గురించి చదివాను. ఆ మొహం ఆధారంగా మరణించిన వారెవరో కనుక్కోవచ్చు. దాన్ని కూడా ఈ నవల్లో వాడాను.

ఆగస్ట్ 2014లో ప్రిజమ్ బుక్స్‌వారు దీన్ని పుస్తకంగా ప్రచురించారు. వెల రూ/170. 221 పేజీలు. ఆరు నెలలలో ఇది రీ ప్రింట్‌కి వచ్చి మరో వెయ్యి కాపీలని ముద్రించారు.

నెగిటివ్ పాత్ర చావుకు దగ్గరకి వచ్చాక పాజిటివ్ కారెక్టర్‌గా మారడం నాలోని ఆధ్యాత్మికత వల్ల వచ్చిన ఆలోచన. రచయితగా నాకు తృప్తి కలిగించిన నవలల్లో ఇదొకటి.

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

Post your comments